జీసీసీ పరిధిలో 200 వైద్యశిబిరాలు



నగరంలో ఏర్పాటైన వైద్య శిబిరం

● మేయర్ ప్రియ

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 200 వార్డుల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ ప్రియ తెలిపారు. ఓట్టేరి చెల్లప్ప వీధిలోని 20 ఏళ్ల ప్రాచీనమైన కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని మంత్రి పీకే శేఖర్ బాబు, జీసీసీ మేయర్ ప్రియ, జీసీసీ కమిషనర్ కుమరగురుబరన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ ప్రియ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరవ మండలం పరిధిలోని ముంపు ప్రాంతాలను పరిశీలించామన్నారు. తిరువిక నగర్ ప్రాంతంలో ఓట్టేరి కాలువ మార్గంలో పలు కెనాల్స్ ఏర్పాటుచేశామన్నారు. ఉత్తర చెన్నై పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగునీరు, తాగునీటి పనులు, ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. వర్షాకాలం కావడంతో తారు రోడ్ల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టలేమని, అందువల్ల జనవరిలో మళ్లీ కొత్త రోడ్లు వేస్తామని తెలిపారు. ఒక్కో ప్రాంతంలో ఎన్ని గుంతలు ఏర్పడ్డాయో వివరాలు సేకరించాలని, ఆ గుంతలను కంకరరాళ్లతో తాత్కాలికంగా మూయాలని అధికారులను ఆదేశించామన్నారు. జీసీసీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు గుర్తించి, వరదల సమయంలో ఆ ప్రాంత ప్రజలను పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లకు తరలించే ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. జీసీసీ పరిధిలో వార్డుల వారీగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో వార్డులో షిఫ్టుల వారీగా ప్రతిరోజు 30 శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి శిబిరంలో సుమారు 150 మంది వైద్యపరీక్షలతో పాటు మందులు అందజేస్తున్నట్లు మేయర్ ప్రియ తెలిపారు.



తెన్‌కాశి సభలో ఓ యువకుడికి ఎంఎస్‌ఎంఈ శాఖ ద్వారా రుణాన్ని అందజేస్తున్న సీఎం స్టాలిన్

ఓట్ల చోరీని ఎదుర్కొంటాం

● తెన్‌కాశి సభలో సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్నికల సంఘం ద్వారా ఓట్ల చోరీకి ప్రయత్నిస్తున్న బీజేపీ కుట్రను సమర్థవంతంగా తిప్పికొడతామని, ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలో ఓట్ల చోరీ జరగకుండా అడ్డుకుంటామని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. అడ్డదారుల్లో రాష్ట్రంలో కాలుమోపాలని ప్రయత్నిస్తున్న బీజేపీ కూటమికి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. తెన్‌కాశిలో బుధవారం ఉదయం ప్రభుత్వం తరఫున ఏర్పాటైన సభలో రూ.141.60 కోట్లతో పూర్తయిన 117 పథకాలను ప్రారంభించి, రూ.291.19 కోట్లతో చేపట్టనున్న 83 కొత్త పథకాలకు సీఎం శంకుస్థాపన చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 2.44 లక్షలమందికిపైగా లబ్ధిదారులకు నగదు, వస్తువులు, వాహనాలు తదితర సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కేనని, అది దుర్వినియోగం కాకుండా జాగ్రత్త వహించడమే డీఎంకే కూటమి ప్రధాన లక్ష్యమన్నారు. పడమటి కనుమల తొలకరి జల్లులతో చల్లటి గాలులతో స్థానికులను, పర్యాటకులను ఆహ్లాదపరిచే జిల్లా తెన్‌కాశి అని, ఉత్తరాదిలో కాశీ లాగే, దక్షిణాదిన తెన్‌కాశి కూడా ప్రశాంతతకు మారు పేరన్నారు. తెన్‌కాశి ఆలయంలో 19 యేళ్ల తర్వాత కుంభాభిషేకం నిర్వహించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని సీఎం పేర్కొన్నారు. డీఎంకే పాలనలో వ్యవసాయోత్పత్తులు ఎక్కువయ్యాయని, ధాన్యం గొనుగోళ్లు పెరిగి, గిడ్డంగుల సంఖ్య పెరిగాయని చెప్పారు. పదేళ్ల అన్నాడీఎంకే పాలనలో వరి దిగుబడి స్వల్పంగానే జరిగిందన్న విషయాన్ని మరచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రోహానికి మారుపేరు ఈపీఎస్ అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ రూ.37వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేయకుండా రాష్ట్రాన్ని ఇబ్బందులపాలు చేయాలని కంకణం కట్టుకుందని, కేంద్రం నుండి నిధులు రాకపోయినా తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం సొంత నిధులతోనే వారి బాగోగులను పట్టించుకుంటోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ కూటమికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని పసిగట్టి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘం ద్వారా ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిహార్ తరహాలోనే రాష్ట్రంలో లక్షల్లో ఓటర్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని, ఎట్టి పరిస్థితులలోనే ఓట్ల చోరీ జరగకుండా తమ కూటమి అడ్డుకుంటుందని తెలిపారు. ఈ విషయమై చర్చలు జరిపేందుకు నవంబర్ 2న అఖిలపక్ష సమావేశం జరుగనుందని చెప్పారు. ఈ సభలో తెన్‌కాశి జిల్లాకు కొన్ని పథకాలను కూడా ఆయన ప్రకటించారు. జిల్లాల్లో 15 గ్రామపంచాయతీ యూనియన్లకు కొత్త కార్యాలయ భవనాలను నిర్మిస్తామని, జిల్లాలో 16 చోట్ల నీటివనరుల పూడిక తీత చేపడతామని, కుత్తంపాంచాన్, మహేంద్రవాడి, కళునీర్‌కుళం, కంబనేరి ప్రాంతాలలో సామాజిక బావులు నిర్మిస్తామని ప్రకటించారు. ఇదే విధంగా చొక్కంబట్టి, పెరుంబుదూరు, గూడలూరు, పరువకుడి తదిత ప్రాంతాల్లో ఆహార ధాన్యాలను నిల్వచేయడానికి గోదాములు, ఆలంకుళం, శివగిరిలో కొత్త రేషన్‌షాపులు, నడువకురిచ్చి ఉద్యాన వనాలశాఖ ఆధ్వర్యంలో ఫామ్‌హౌస్, తెన్‌కాశి ఆసుపత్రిలో చిన్నపిల్లల వార్డు, మేల్‌కరై నల్లూరులోఆరోగ్య కేంద్రం నిర్మించనున్నట్లు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ తదితర కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి రూ.15 కోట్లతో 11 నివాసగృహ సముదాయాలను నిర్మిస్తామని తెలిపారు. ఈ సభలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ. పెరియసామి, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, గీతాజీవన్, రాజకన్నప్పన్, మనో తంగరాజ్, లోక్‌సభ సభ్యులు కనిమొళి, రాబర్ట్ బ్రూస్, శాసనసభ్యులు రాజా, సదన్ తిరుమలైకుమార్, అబ్దుల్ వహాబ్, పళనినాడార్, మాజీ స్పీకర్ ఆవుడయప్పన్, మాజీ మంత్రులు పూంగోదై ఆలడి అరుణా, తంగవేల్, అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ, జిల్లా కలెక్టర్ కమల్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లక్షకు పెరిగిన లబ్ధిదారులు...

ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కలైంజర్ గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారుల సంఖ్య బుధవారం లక్షకు పెరిగింది. తెన్‌కాశిలో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటన ఆ పథకం కింద నిర్మించిన కొత్త నివాసగృహం తాళాన్ని ఇలత్తూరు గ్రామానికి చెందిన ఎం.సుమతి అనే లబ్ధిదారురాలికి అందజేశారు.

ఆగని బాంబు బెదిరింపులు

● అమెరికన్ ఎంబసీ, ప్రభు నివాసాల్లో తనిఖీలు

ప్యారీస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో నెలరోజులుగా బాంబు బెదిరింపులు వరుసగా వస్తుండటంతో పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణు ముమ్మర తనిఖీలు చేయడంలో తలమునకలవుతున్నారు. గతంలో బాంబు బెదిరింపులు పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్‌కాల్స్ రూపంలో వస్తుండేవి. ప్రస్తుతం సరాసరి డీజీపీ కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తులు ఈమెయిల్ పంపుతున్నారు. తాజాగా స్థానిక అమెరికా దౌత్య కార్యాలయం, నటుడు ప్రభు నివాసంలో బాంబులు పేలుతాయంటూ వచ్చిన బెదిరింపులపై పోలీసులు స్పందించారు. బుధవారం ఉదయం అన్నాసాలై కూడలి వద్దనున్న అమెరికా రాయబారి కార్యాలయం, టి.నగర్‌లోని నటుడు ప్రభు నివాసంలో బాంబ్ స్క్వాడ్ నిపుణుల ద్వారా ముమ్మరంగా తనిఖీలు చేయించారు. అన్ని చోట్లా సోదాలు చేశారు. చివరకు అవన్నీ ఉత్తుత్తి బాంబు బెదరింపులేనని తేలటంతో పోలీసులు ఊరట చెందారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు రూ.35 లక్షల లంచమా?

● ఈపీఎస్ ఆగ్రహం

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగరపాలన, తాగునీటి సరఫరా శాఖలలో ఉద్యోగాల ఎంపికల్లో భారీ యెత్తున అవినీతి జరుగుతోందని, ప్రభుత్వ ఉద్యోగం కోసం రూ.35 లక్షల దాకా లంచం ఇచ్చుకోవాల్సిన అగత్యం ఏర్పడుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు. నగరపాలన, తాగునీటి సరఫరా శాఖలో ఖాళీ పోస్టుల భర్తీలో భారీ యెత్తున అక్రమాలు జరిగాయని, ఈ అవినీతిలో సుమారు రూ.800 కోట్ల మేరకు అక్రమ నగదు బట్వాడా జరిగిందని ఈపీఎస్ పేర్కొన్నారు. రాష్ట్రమంతటా ఐటీ, ఈడీ జరిపిన సోదాల సందర్భంగా ఈ అవినీతి వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ అవినీతిలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, ఆయన సోదరులకు చెందిన సంస్థల అధికారులు కీలకపాత్ర పోషించారని, ఉద్యోగం కోసం వచ్చినవారి వద్ద రూ.25 లక్షల నుండి రూ.35 లక్షల దాకా లంచాలుగా స్వీకరించారని ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ జరపాలని ఆయన ఈడీకి విజ్ఞప్తి చేశారు. కాగా ఈపీఎస్ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని నగరపాలక శాఖా మంత్రి కేఎన్ నెహ్రూ తీవ్రంగా ఖండించారు. నగరపాలక శాఖలో ఉద్యోగాల పేరుతో ఎలాంటి ముడుపులు తీసుకోలేదని, ఈడీ జరిపిన దాడుల్లో గాని, సోదాల్లోగానీ తన శాఖలో అవినీతి అక్రమాలు జరిగినట్టు ఇప్పటి వరకు ఈడీ అధికారులు ఎలాంటి ప్రకటన కూడా చేయలేదని ఈ సందర్భంగా మంత్రి నెహ్రూ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రారంభం

● అఖిలపక్ష సమావేశాల్లో అభిప్రాయ సేకరణ



సచివాలయంలో అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి అర్చనా పట్నాయక్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఓ వైపు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ నేతృత్వంలోను, మరో వైపు చెన్నై జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి జే కుమారగురుబరన్ పర్యవేక్షణలోను అఖిలపక్ష సమావేశాలు జరిగాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ సహా 12 రాష్ట్రాల్లోనూ ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పనులు జరిపేందుకు ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. ఆ ప్రకారమే రాష్ట్రమంతటా ఆయా జిల్లాలకు ఎన్నికల నిర్వహణాధికారులుగా ఉన్న కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 28 నుంచి నవంబర్ 3 వరకు గుర్తింపు కలిగిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, చర్చలు జరపాలని, ఓటర్లజాబితా సవరణపై సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ పనులన్నీ పూర్తయిన తర్వాత రాష్ట్రమంతటా నవంబర్ 4 నుంచి డిసెంబర్ నాలుగు వరకు ఎన్నికల సంఘం సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నారు. ఈ పనులన్నీ పూర్తయిన తర్వాత డిసెంబర్ 9న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. వచ్చే యేడాది జనవరి 8 వరకు ఓటర్ల జాబితాలో సవరణ, మార్పులు, చేర్పులు, తొలగింపులు జరుగుతాయి. ఇవన్నీ పూర్తయ్యాక వచ్చే యేడాది ఫిబ్రవరి 7న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నారు. ఈ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులపై సచివాలయంలో బుధవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి అర్చనా పట్నాయక్ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీఎంకే తరఫున ఆర్ఎస్ భారతి, ఎన్ఆర్ ఇలంగో, అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రి జయకుమార్, ఇన్బదురై, కాంగ్రెస్ తరఫున తంగబాలు, డి. సెల్వం, బీజేపీ తరఫున కరాటే త్యాగరాజన్, కరు నాగరాజన్, నామ్ తమిళర్ కట్చి తరఫున సెందిల్‌కుమార్, డీఎండీకే తరఫున పార్థసారథి, న్యాయవాది జనార్థనన్, డీపీఐ తరఫున ఎస్ఎస్ బాలాజీ, సీపీఎం తరఫున ఆరుముగ నయినార్, సాముఏల్‌రాజ్, సీపీఐ తరఫున పెరియసామి,డాక్టర్ రవీంద్రనాధ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఆయా పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పలు సూచనలు చేశారు.ఈ సమావేశానికి ముందు ఎన్నికల సంఘం ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ వివిధ జిల్లాల కలెక్టర్లతోనూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.







రిప్పన్‌భవనంలో అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న చెన్నై జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి జే కుమారగురుబరన్

నెల తర్వాత మళ్లీ చురుగ్గా విజయ్

● అన్నాడీఎంకేతో పొత్తు లేనట్టే



చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్ళీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరులోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని, మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభింపజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయకుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టిసారిస్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారా? అని విలేఖరుల ప్రశ్నించగా, నెల రోజులకు ముందు పార్టీ ఏ స్థితిలో ఉండేదో ఆ స్థితిలోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీతో పొత్తు లేనట్లేనని సూచనప్రాయంగా నిర్మల్‌కుమార్ తెలియజేశారు.

3 వరకు మోస్తరు వర్షాలు

అడయార్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరిలో నవంబరు 3వ తేది వరకు మోస్తరు వర్షాలు కురువనున్నాయి. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుఫానుగా మారి కాకినాడ సమీపంలో తీరం దాటిందన్నారు. అలాగే, మధ్య తూర్పు అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతుందని, రాబోయే 36 గంటల్లో అల్పపీడనం కదిలే అవకాశముందని భావిస్తున్నట్లు తెలిపింది. తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరిలలో గురువారం నుంచి మూడు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. రాజధాని నగరం చెన్నై, శివారు ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

నేడు పసుంపొన్ దేవర్ జయంతి

● ఉపరాష్ట్రపతి సీపీఆర్, సీఎం స్టాలిన్ నివాళి



ముత్తురామలింగదేవర్ విగ్రహం

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ 118వ జయంత్యుత్సవాలు, 63వ గురుపూజోత్సవం సందర్భంగా గురువారం ఉదయం ఆయన సంస్మరణ స్థలం వద్ద ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఇతర పార్టీల నాయకులు నివాళులర్పించనున్నారు. వీరి పర్యటన నేపథ్యంలో ఐజీ నేతృత్వంలో సుమారు 8 వేలమంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పసుంపొన్ ముత్తురామలింగదేవర్ 1908 అక్టోబర్ 30న జన్మించి, 1963 అక్టోబర్ 30 కన్నుమూయడంతో గురువారం 118 వ జయంతి ఉత్సవాలు, 63వ గురుపూజోత్సవం (సంస్మరణదిన పూజలు) ఏకకాలంలో నిర్వహించనున్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించనున్నారు. దీని కోసం ఆయన బుధవారం సాయంత్రం మదురై చేరుకున్నారు. రాత్రి మీనాక్షి అమ్మవారిని దర్శించి, మదురైలోని ప్రభుత్వ అతిథిగృహంలో బసచేశారు. గురువారం ఉదయం మదురై నుండి ఆయన వైమానిక దళం హెలికాప్టర్‌లో పసుంపొన్ గ్రామానికి చేరుకుని, దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించనున్నారు. సీఎం స్టాలిన్ తెన్‌కాశి జిల్లా పర్యటన ముగించుకుని బుధవారం సాయంత్రం మదురై చేరుకున్నారు. గురువారం మదురై నుంచి కారులో బయలుదేరి గోరిపాళ్యంలో ఉన్న పసుంపొన్ దేవర్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి పసుంపొన్ ప్రాంతానికి చేరుకుని దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పిస్తారు. స్టాలిన్‌తోపాటు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. ఇదే విధంగా కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ఎల్.మురుగన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, ఎండీఎంకే నేత వైగో, ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం, టీఎంసీ నేత జీకే వాసన్ తదితర నేతలు ముత్తురామలింగదేవర్ స్మారక స్థలంలో నివాళులర్పించనున్నారు. ఒకే రోజు వీఐపీలంతా నివాళి కార్యక్రమంలో పాల్గొననుండటంతో ఐజీ ప్రేమానంద్ సిన్హా నాయకత్వంలో పసుంపొన్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... తేనాంపేట పరిధిలోని పోయస్ గార్డెన్, టీవీ రోడ్డు, జయమ్మాళ్ రోడ్డు, ఇళంగో రోడ్డు, పోయస్ రోడ్డు, రాజకృష్ణ రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, పెరియార్ రోడ్డు, కామరాజర్ రోడ్డు, సీతమ్మాళ్ కాలని, కేబీ దాసన్ రోడ్డు, భారతీయార్ వీధి, భక్తవత్సలం వీధి, అప్పాదురై వీధి, టీటీకే రోడ్డు, కాథడ్రల్ రోడ్డు, జేజే రోడ్డు, పార్థసారధి పేట-గార్డెన్, కేఆర్ రోడ్డు, జార్జి అవెన్యూ, ఎస్ఎస్ఐ రోడ్డు, హెచ్‌డీ రాజా వీధి, ఏఆర్కే కాలనీ, అన్నాసాలై, వీనస్ కాలనీ, ముర్రాస్ గేట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

7వ తేదిలోగా సర్టిఫికెట్ల అప్‌లోడ్: టీఎన్‌పీఎస్సీ

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 ఫలితాలు విడుదల కావడంతో, నవంబరు 7వ తేదిలోగా సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని అభ్యర్థులకు టీఎన్‌పీఎస్సీ సూచించింది. కంప్యూటర్ ఆధారిత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం, నవంబరు 7వ తేదిలోపు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని తెలిపింది.

2న పళవేర్కాడు జాలర్ల చేపల వేటపై నిషేధం

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు జాలర్లు నవంబరు 2వ తేది చేపల వేటకు సముద్రంలోకి వెళ్లడంపై నిషేధం విధించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఆంధ్ర రాష్ట్రం శ్రీహరికోట షార్ నుంచి ఈ నెల 2వ తేది 'ఎల్‌వీఎం3-ఎం5' రాకెట్ ప్రయోగించనున్నారు. దాని భద్రత దృష్ట్యా పళనివేర్కాడు జాలర్లు చేపల వేటపై నిషేధం విధిస్తున్నామన్నారు. ఆ రోజున కోస్ట్ గార్డ్, తీరప్రాంత భద్రత దళాలు సముద్రంలో గస్తీ తిరుగుతాయని ప్రకటనలో తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శబరిమల ఆలయంలో మండల పూజ, మహా దీపారాధన తదితర వేడుకలను పురస్కరించుకుని నవంబరు 16 నుంచి జనవరి 16వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఈ మేరకు ఎస్ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో.. కోయంబేడు, కిలాంబాక్కం, తిరుచ్చి, మదురై, పుదుచ్చేరి, కడలూరు తదితర ప్రాంతాల నుంచి పంబకు ఏసీ, నాన్ ఏసీ స్లీపర్ బస్సులు నడుపనున్నామన్నారు. అదే సమయంలో, భక్తుల రద్దీ పరిశీలించి అదనపు బస్సులు నడుపుతామని తెలిపారు. బృందాలకు అద్దెకు ఏసీ, నాన్ ఏసీ బస్సులు కేటాయించనున్నట్లు తెలిపారు. బృందాలుగా వెళ్లే వారు తమ ప్రయాణానికి రెండు నెలలు ముందుగా బస్సు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9445014452, 9555014424, 9445014463 అనే నెంబర్లు సంప్రదించవచ్చని ఎస్ఈటీసీ తెలిపింది.

అరుణాచలేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.6.21 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.6.21కోట్లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయం, 14 కి.మీ గిరిప్రదిక్షణ మార్గంలోని అష్ట లింగం తదితర ఆలయాల్లో, భక్తులు హుండీల్లో వేసిన కానుకలను నెలకొకసారి లెక్కిస్తుంటారు. ఆ ప్రకారం, పురటాసి నెల పౌర్ణమి వరకు భక్తులు చెల్లించిన కానుకల లెక్కింపు ఆలయ మండపంలో రెండు రోజులు నిర్వహించారు. మొత్తం రూ.6,21,74,473 నగదు, 245 గ్రాముల బంగారం, 2,264 గ్రాముల వెండిని భక్తులు హుండీలో వేసారని ఆలయ అధికారులు తెలిపారు.

మెట్రో రైల్వేస్టేషన్ల నుంచి ఏసీ మినీ బస్సులు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్వేస్టేషన్ల నుంచి సమీపంలోని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ ఏసీ మినీ బస్సులు నడపాలని మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నిర్ణయించింది. ప్రస్తుతం నగరంలో 41 మెట్రో రైల్వేస్టేషన్లుండగా, ప్రతిరోజు సుమారు 3 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఎంటీసీ ప్రయాణికుల సౌకార్యర్థం మెట్రో రైల్వేస్టేషన్ల నుంచి పలు ప్రాంతాలకు మినీ బస్సులు నడుపుతోంది. ప్రస్తుతం మెట్రో రైల్వేస్టేషన్ల నుంచి సమీపంలోని ప్రధాన ప్రాంతాలను అనుసంధానం చేస్తూ 220 ఏసీ బస్సులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నడిపేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

పీజీ వైద్యకోర్సుల కౌన్సెలింగ్ ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పీజీ వైద్యకోర్సుల సీట్ల భర్తీకి ఆలిండియా కౌన్సెలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రంలో 5వేలు సహా దేశవ్యాప్తంగా 70 వేలకు పైగా ఉన్న ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమో సీట్లున్నాయి. వీటిని పీజీ నెట్ ద్వారా భర్తీచేయనున్నారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఆగస్టు 3వ తేది నిర్వహించి, ఫలితాలు ఆగస్టు 19వ తేది విడుదల చేశారు. ఈ క్రమంలో, పీజీ వైద్యకోర్సులకు ఆలిండియా కోటా సీట్లకు మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీజీహెచ్ఎస్), మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ)లు ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ ప్రారంభించాయి. ఆన్‌లైన్‌లో నవంబరు 5వ తేది అర్ధరాత్రి 12 గంటల వరకు కౌన్సెలింగ్‌కు నమోదుచేసుకోవచ్చు. అలాగే, ఈ నెల 28 నుంచి నవంబరు 5వ తేది అర్ధరాత్రి 11.55 గంటల వరకు సీటు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. నవంబరు 6,7 తేదీల్లో ర్యాంకుల జాబితా ఆధారంగా సీట్లు కేటాయించి, 9వ తేది ఫలితాలు విడుదల చేయనున్నారు. ఇక, రెండో విడత కౌన్సెలింగ్ నవంబరు 19వ తేది, మూడో విడత కౌన్సెలింగ్ డిసెంబరు 8వ తేది, ఖాళీ సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ డిసెంబరు 30వ తేది ప్రారంభం కానున్నాయని ప్రకటించారు.. రాష్ట్రంలోని వైద్య కళాశాల సీట్లలో ఆలిండియా కోటా సీట్లు పోగా, మిగిలిన 50 శాతం సీట్లు, ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఉన్న సీట్లకు వైద్య విద్య, పరిశోధన డైరెక్టరేట్ నిర్వహించనుంది. ఆ ప్రకారం, రాష్ట్రంలో పీజీ వైద్య కోర్సుల కౌన్సెలింగ్ నవంబరు 6వ తేది ప్రారంభం కానుంది.

తడిసిన ధాన్యం బస్తాలు



తడిసిన వరిధాన్యం బస్తాలు

తిరుత్తణి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆవరణలో ఉంచిన ధాన్యం బస్తాలు భారీవర్షాలకు తడిసి మొలకలెత్తుతున్నాయి. పళ్లిపట్టు యూనియన్‌లోని బొమ్మరాజుపేట, నొచ్చిలి, వడకుప్పం తదితర ప్రాంతాల్లో సాగుచేసిన ధాన్యం బస్తాలను పళ్లిపట్టులోని కొనుగోలు కేంద్రంలో భద్రపరిచారు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం కురిసిన వర్షాలకు కేంద్రం బయట వుంచిన ధాన్యం బస్తాలపై నాసిరకం టార్పాలిన్ పట్టలను కప్పారు. దీంతో బస్తాలు పూర్తిగా తడిసిపోయి తీవ్ర నష్టంవాటిల్లింది. ఈ సందర్భంగా పాండ్రవేడు గ్రామానికి చెందిన వరిరైతు నందకుమార్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ఉంచిన సుమారు 500 ధాన్యం బస్తాలు వర్షానికి తడిసి మొలకలెత్తుతున్నాయని, ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు చేయడమే దీనికి కారణమని వాపోయారు. వెంటనే కొనుగోలు కేంద్రం నుండి వరిధాన్యం బస్తాలను వేరే స్థలానికి తరలించి, త్వరితగతిన వాటిని ప్రభుత్వం కొనుగోలు చేయాలని అధికారులను ఆయన కోరారు.

తిరువళ్లూరు జిల్లాలో వర్ష బీభత్సం

● నేలకొరిగిన చెట్లు



రోడ్డుపై కూలిన చెట్టు

తిరుత్తణి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు తిరువళ్లూరు జిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం రాత్రి నుండి బుధవారం వరకు కురిసిన వర్షానికి పళ్లిపట్టు సహా పొన్నేరి, ఆర్కేపేట, తిరువలంగాడు, తిరుత్తణి తదితర ప్రాంతాల్లో భారీవర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో పళ్లిపట్టు సమీపంలోని ఆర్కేపేటలో అత్యల్పంగా 4.6మి.మీ వర్షపాతం, పొన్నేరిలో 12 మి.మీ వర్షపాతం నమోదు కాగా, జిల్లావ్యాప్తంగా మొత్తం 554.60 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది.. కాగా, కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు లోతట్టు ప్రాంతాల్లోని గుడిసెలు, రేకుల ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా, రహదారుల్లో చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా వుండగా, నదులు, చెరువుల్లో వరద ఉధృతి పెరుగి పాడిపశువులు, మేకలు తదితరాలు కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. దీనితో ప్రజలను నదీ పరివాహిక ప్రాంతాల వద్దకు వెళ్లనివ్వకుండా పోలీసులు పటిష్ఠచర్యలు చేపట్టారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి 21 ఏళ్ల జైలు

అడయార్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లాలో ముగ్గురు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి కోర్టు 21 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఓ ప్రాంతానికి చెందిన బాలికలను అరిమలంకు చెందిన పీర్ మహ్మద్ (48) లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాధితుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు పీర్ మహ్మద్‌ను అరెస్టుచేశారు. ఈ కేసు పుదుకోట కోర్టులో విచారణ ముగియడంతో, నిందితుడు పీర్ మహ్మద్‌కు 21 ఏళ్ల జైలుశిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత బాలికలకు తలా రూ.5 లక్షల పరిహారం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

7న ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ సమావేశాలు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నవంబరు 2వ తేది స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సమావేశాలు జరపాలని ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సమగ్ర పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర పథక డైరెక్టర్ ఎం.ఆర్తీ జిల్లా ప్రధాన విద్యాధికారులకు పంపిన ఉత్తర్వులో వివరాలిలా ఉన్నాయి... అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నవంబరు 7వ తేది మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎస్ఎంసీ సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇటీవల ముగిసిన త్రైమాసిక పరీక్షల్లో విద్యార్థులు పొందిన మార్కుల ఆధారంగా వారి నైపుణ్యాభివృద్ధి పెంచడం, బడి మానివేసిన విద్యార్థులను మళ్లీ బడిలో చేర్పించేలా చేపట్టాల్సిన చర్యలు, విద్యాబోధన, విద్యార్థుల క్రమశిక్షణ, పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితరాలపై చర్చించాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత



సైన్స్ ఫెయిర్ ప్రారంభిస్తున్న ప్రముఖ శాస్త్రవేత్త డా.రాజేంద్రన్ తదితరులు

తిరుత్తణి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని కేవీ పాఠశాలలో బుధవారం ఉదయం సైన్స్ ఫెయిర్ ప్రారంభమైంది. పాఠశాల ప్రిన్సిపల్ గోమతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త డా.రాజేంద్రన్ పాల్గొన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ నశ్రిన్ స్వాగతం పలుకగా ఆయన సైన్స్‌ఫేర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత వృద్ధి చెందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన పరిశీలించి అభినందించారు.

2026 ఎన్నికల తర్వాత బీజేపీ అదృశ్యం

● మంత్రి రఘుపతి జోస్యం

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ అదృశ్యమవుతుందని, డీఎంకే మళ్లీ అధికారం చేపడుతుందని మంత్రి రఘుపతి జోస్యం చెప్పారు. పుదుకోటలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఎస్ఐఆర్‌పై నవంబరు 2వ తేది అఖిలపక్ష సమావేశం తర్వాత ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారన్నారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించేలా ఎన్నికల సంఘాన్ని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉపయోగిస్తోందని ఆరోపించారు. బిహార్‌లోను ఇలాంటి ప్రయత్నం జరిగిందన్నారు. అలాంటి చర్యలను డీఎంకే అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రానికి ఉపాధి కోసం వచ్చే ఉత్తరాది కార్మికుల సంఖ్య లక్షల నుంచి కోటికి చేరిందన్నారు. తమిళనాడు అంటే తెలియనివారు, ఒకే ప్రాంతంలో శాశ్వతంగా ఉండనివారని రాష్ట్ర ఓటర్ల జాబితాలో చేర్చరాదని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. డీఎంకే ప్రభుత్వంపై బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. డీఎంకేను ప్రజలు ఆదరిస్తున్నారని, వారి ఆదరణతో రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మళ్లీ సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే 2.0 ప్రభుత్వం ఏర్పాటవుతోందని మంత్రి తెలిపారు.

ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మొక్కలునాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న బ్యాంక్ సిబ్బంది

తిరుత్తణి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం మొక్కలునాటే కార్యక్రమం జరిగింది. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ హరిబాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు మేనేజర్ రవీంద్ర, నివేదిత, శ్యామ్‌వేల్, ఉదయ్‌మూర్తి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కంలో వ్యభిచారం సాగిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలోని వ్యభిచార నిరోధక విభాగం-1 విభాగానికి అందిన సమాచారంతో, విరుగంబాక్కం తారాచంద్ నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు, వలసరవాక్కం ప్రాంతానికి చెందిన నరేష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. అలాగే, ఆ ఇంటిలోని ముగ్గురు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.


కారైక్కాల్ జాలర్లకు రిమాండ్ పొడిగింపు

ప్యారీస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో ఉన్న కారైక్కాల్ జాలర్ల రిమాండ్‌ను ఆ దేశ న్యాయస్థానం పొడిగించింది. కారైక్కాల్‌కు చెందిన జాలర్లు గత నెల 29వ తేది సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. నడుదీవు ప్రాంతంలో వారు చేపలు పడుతుండగా, వారిని శ్రీలంక నావికా దళం చుట్టుముట్టింది. సరిహద్దులు దాటి చేపల వేటకు వచ్చారంటూ బెదిరించిన శ్రీలంక నావికాదళం, 29 మంది జాలర్లను అరెస్ట్ చేసి శ్రీలంక జైళ్లకు తరలించింది. జాలర్లకు విధించిన రిమాండ్ గడువు బుధవారంతో ముగిసిన నేపథ్యంలో, వారిని కోర్టులో హాజరుపరచగా, వారి రిమాండ్ నవంబరు 7వ తేది వరకు న్యాయస్థానం పొడిగిరచింది. కాగా, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలను విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర జాలర్ల సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది.

ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా 36,353 మందికి లబ్ధి

ప్యారీస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల వ్యాప్తి కారణంగా ఈ నెల 17 నుంచి 28వ తేది వరకు నిర్వహించిన వర్షాకాల ప్రత్యేక వైద్య శిబిరాల్లో 36,353 మంది లబ్ధి పొందారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈశాన్య రుతుపవనాల ముందస్తు చర్యల్లో భాగంగా జీసీసీ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో ఈ నెల 17 నుంచి 28వ తేది వరకు 627 శాశ్వత వైద్య శిబిరాలు, 217 సంచార వైద్య శిబిరాలు అని మొత్తం 844 వర్షాకాల ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి, 36,353 మందికి వైద్య పరీక్షలో నిర్వహించి మందులు అందజేసినట్లు జీసీసీ తెలిపింది.

ప్రజా గ్రీవెన్స్‌లో 20 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేపేరిలో నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిచండంతో పాటు వారి సమస్యలు విన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు. కాగా, ప్రతి బుధవారం జరిగే గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని, తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని నగర పోలీసు శాఖ ప్రకటనలో తెలియజేసింది.

హార్బర్లలో తుఫాను హెచ్చరికల ఉపసంహరణ

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తీవ్ర తుఫానుగా మంగళవారం రాత్రి తీరం దాటిన నేపథ్యంలో, తొమ్మిది హార్బర్లలో తుఫాను హెచ్చరికలను తొలగించారు. బంగాళాఖాతం ఏర్పడి తీవ్ర తుఫానుగా బలపడిన 'మొంథా' తుఫాను ఆంధ్ర రాష్ట్రం కాకినాడ సమీపంలో మంగళవారం రాత్రి తీరం దాటింది. ఈ క్రమంలో, మొంథా తీరం దాటడంతో, రాష్ట్రంలోని తొమ్మిది హార్బర్లలో తుఫాను ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించుకున్నారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

అడయార్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటి రాక తగ్గింది. మంగళవారం డ్యాంలోని 7,500 ఘనపుటడుగుల మేర వస్తున్న నీరు, బుధవారం 5,500 ఘనపుటడుగులకు తగ్గింది. అలాగే, పై ప్రాంతాల నుంచి వస్తున్న 5,500 ఘనపుటడుగులకు అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం పూర్తి సామర్థ్యం 120 అడుగులతో 93.470 టీఎంసీల నీరుందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు

అబార్షన్‌కు యత్నం.. విద్యార్థిని మరణం

ప్యారీస్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యుడి దగ్గర అబార్షన్ చేయించుకొనేందుకు యత్నించిన కళాశాల విద్యార్థిని మృతిచెందిన ఘటన దిండుగల్ జిల్లాలో చోటుచేసుకుంది. అయ్యలూరులో ఓ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక దిండుగల్ జిల్లాలోని ఓ కళాశాలలో చదువుతోంది. ఈ నెల 24వ తేది అనారోగ్యం కారణంగా విద్యార్థినిని తల్లిదండ్రులు దిండుగల్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు, ఆమె ఏడు నెలల గర్భవతిగా నిర్ధారించి, చికిత్స ప్రారంభించారు. కానీ, అక్కడ చికిత్స ఫలించక విద్యార్థిని మృతిచెందింది. ఈ వ్యవహారంపై వడమదురై మహిళా పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. విద్యార్థినికి ఓ యువకుడితో ఉన్న పరిచయం కారణంగా గర్భం దాల్చి, ఈ విషయం ఎవరికి చెప్పకుండా దాచింది. కానీ, ఒకానొక సమయంలో దాచిపెట్టలేని పరిస్థితి రావడంతో, ఆమె తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను దిండుగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి అబార్షన్ చేయించేందుకు యత్నించగా, ఆమె తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో, దిండుగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిసింది. సదరు అబార్షన్ చేసేందుకు యత్నించిన వ్యక్తి నకిలీ వైద్యుడని గుర్తించిన పోలీసులు, అతని కోసం గాలిస్తున్నారు.

నామక్కల్ కిడ్నీ విక్రయాల కేసులో నివేదిక దాఖలు చేయండి

ప్యారీస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ కిడ్నీ వ్యవహారం కేసులో ఇప్పటివరకు చేపట్టిన విచారణ నివేదిక రూపంలో దాఖలుచేయాలని హైకోర్టు మదురై బెంచ్ బుధవారం ఆదేశించింది. నామక్కల్ కిడ్నీ విక్రయ వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ పరమకుడికి చెందిన సతీశ్వరన్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ హైకోర్టు గత నెలలో విచారించి, కేసు విచారణకు దక్షిణ మండల పోలీసు అధ్యక్షులు నేతృత్వంలో సిట్ ఏర్పాటుచేసింది. ఈ కేసు బుధవారం మళ్లీ విచారణకు రాగా, సిట్ బృందం ఇప్పటివరకు చేపట్టిన విచారణ నివేదిక దాఖలుచేయాలని ఆదేశించిన న్యాయస్థానం, తదుపరి విచారణ నవంబరు 11వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

జనావాసాల్లో వెయ్యి పాముల పట్టివేత

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా చెన్నై, పరిసర జిల్లాల్లో జనావాస ప్రాంతాల్లో చేరిన వెయ్యి పాములను అగ్నిమాపక సిబ్బంది బంధించారు. ఈ మేరకు అగ్నిమాపక శాఖ విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం తదితర జిల్లాల్లో ఈ నెల 16 నుంచి 27వ తేది వరకు పాములు చేరాయంటూ 601 కాల్స్ వచ్చాయన్నారు. వాటిలో చెన్నై నుంచే 424 కాల్స్ వచ్చాయని తెలిపారు. ఆయా ప్రాంతాలకు వెళ్లి 61 విష పూరితం, 363 విషరహిత పాములు బంధించామన్నారు. మేడవాక్కం, తాంబరం, పల్లికరణై, పెరుంబాక్కం, వేళచ్చేరి, కీల్పాక్కం రైల్వే క్వార్టర్స్ తదితర ప్రాంతాల నుంచి ఈ కాల్స్ వచ్చాయన్నారు. ఆ ప్రాంతాల్లో 103 విష పూరితం, 498 విషరహిత పాములను బంధించి అటవీ శాఖ అప్పగించినట్లు తెలిపారు. పాములు సహా విష జంతువులను బంధించేందుకు 044-22200335 అనే నెంబరుకు సమాచారం అందించాలని అగ్నిమాపక శాఖ తెలియజేసింది.

కారు ఢీకొని దంపతుల మృతి

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నత్తం సమీపంలో కారు ఢీకొని రోడ్డు పక్కన నడిచివెళుతున్న దంపతులు మృతిచెందారు. దిండుగల్ జిల్లా కుంభసాలై ప్రాంతానికి చెందిన రాజా (50)-ఫెనలి (45) దంపతులు మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న కుమార్తె ఇంట్లో నిద్రపోయి, బుధవారం ఉదయం నత్తం-తువరంకుర్చి జాతీయ రహదారి పక్క నుంచి తమ ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో నత్తం నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన నడిచి వెళుతున్న దంపతులను ఢీకొంది. ఆ దంపతులు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న నత్తం పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కు తరలించి, కేసు నమోదుచేసి కారు డ్రైవర్ మాడస్వామిని అదుపులోకి తీసుకున్నారు.

దేవర్ గురుపూజ బందోబస్తుకు వెళ్లి గుండెపోటుతో హెచ్‌సీ మృతి



కలైవాణి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పసుమ్‌పొన్ దేవర్ గురుపూజోత్సవం సందర్భంగా బందోబస్తు కోసం వచ్చిన మహిళా కానిస్టేబుల్ గుండెపోటుకు గురై మృతి చెందారు.. రామనాథపురం జిల్లా కళుది సమీపంలో ఉన్న పసుమ్‌పొన్‌లో గురువారం ముత్తురామలింగ దేవర్ 63వ గురుపూజ, 118వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకల బందోబస్తు కోసం పలు జిల్లాల నుంచి సుమారు 8వేల పోలీసులను పిలిపించారు. వీరిలో కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై హెడ్ కానిస్టేబుల్ కలైవాణి (41) కూడా ఉన్నారు. ఆమె మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో కళుదిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిద్రిస్తున్న సమయంలో నిరంతం దగ్గుతో బాధపడుతుండగా సహచర పోలీసులు అంబులెన్స్‌లో కళుది ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు, ఆమె గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహానికి రామనాథపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కళుది పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మరణంలోనూ వీడని బంధం



మృతులు ధనస్వామి-రాణి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మృత్యువు కూడా వారిని విడదీయలేకపోయింది. భార్య మృతిచెందిన కొద్ది గంటల్లోనే భర్త మృతిచెందిన ఘటన అరియలూరు జిల్లాలో చోటుచేసుకుంది. అయ్యప్పన్‌నాయకన్‌పేట గ్రామంలో దనస్వామి (64) రాణి (57) దంపతులు నివశిస్తున్నారు. రాణి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే చికిత్స తీసుకుంటోంది. సోమవారం సాయంత్రం రాణి మరణించగా, అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. భార్య మృతిచెందినప్పటి నుంచి తీవ్ర ఆవేదనతో ఉన్న ధనస్వామి, అంత్యక్రియలు ప్రారంభమయ్యే సమయంలో హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు చూసి, అతను కూడా మృతిచెందినట్లు నిర్ధారించారు. రాణి అంత్యక్రియలకు ముందే భర్త కూడా మృతిచెందడం కుటుంబ సభ్యులను మరింత వేదనకు గురిచేసింది. ఇరువురి మృతదేహాలను మంగళవారం రాత్రి ఖననం చేశారు.

10వ తరగతి విద్యార్థితో ప్రేమాయణం

● గర్భం దాల్చిన కళాశాల విద్యార్థినిపై పోక్సో కేసు

అడయార్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థితో ప్రేమాయణం సాగించి గర్భం దాల్చిన కళాశాల విద్యార్థినిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తిరువణ్ణామలై జిల్లా వందవాసికి చెందిన కళాశాల విద్యార్థినికి అదే ప్రాంతానికి చెందిన 10వ తరగతి విద్యార్థితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరి పరిచయం కారణంగా ఆమె మూడు నెలల గర్భంతో ఉంది. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు, విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులపై పోక్సో కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

ఎంటీసీ బస్సు ఢీకొని ఐటీ ఉద్యోగి మృతి

అడయార్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం జీఎస్‌టీ రోడ్డులో ద్విచక్రవాహనాన్ని ఎంటీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐటీ ఉద్యోగి మృతిచెందాడు. తిరువళ్లూర్ జిల్లా కొళత్తూర్ లక్ష్మీపురం గంగైఅమ్మన్ ఆలయ వీధికి చెందిన రిచర్డ్ (31) పల్లికరణై రేడియల్ రోడ్డులోని ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని తన వాహనంపై ఇంటికి బయల్దేరాడు. మీనంబాక్కం జీఎస్‌టీ రోడ్డు సెయింట్ వేలాంకన్ని చర్చి ప్రాంతంలో ద్విచక్రవాహనాన్ని తాంబరం వైపు వెళ్తున్న ఎంటీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నుంచి కిందపడిన రిచర్డ్ తలపై బస్సు చక్రం ఎక్కింది. ఈ ఘటనలో రిచర్డ్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సెయింట్ థామస్ మౌంట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి, ప్రమాదానికి కారణమైన ఎంటీసీ డ్రైవర్ ఎడ్వర్డ్ తంబి (45)ని అదుపులోకి తీసుకున్నారు.

ఈడీ విచారణకు హాజరైన నటుడు కృష్ణ

● మరో రోజు కేటాయించాలన్న శ్రీకాంత్

అడయార్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్రాల కేసులో, నటుడు కృష్ణ నుంగంబాక్కంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యాడు. కొద్దినెలల క్రితం, కొకైన్ తరలింపు వ్యవహారంలో, నటులు శ్రీకాంత్, కృష్ణలను మాదకద్రవ్యాల తరలింపు నిరోధక విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇద్దరికి బెయిలు లభించడంతో జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులో చట్టవిరుద్ధంగా నగదు బదిలీ జరిగిందా? అనే విషయమై ఈడీ ప్రత్యేకంగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. దీంతో విచారణకు హాజరుకావాలని శ్రీకాంత్, కృష్ణలకు ఈడీ సమన్లు పంపింది. మంగళవారం జరిగిన విచారణకు శ్రీకాంత్ హాజరుకాలేదు. అతడి తరఫున మరో రోజు కేటాయించాలంటూ ఈడీ అధికారులను కోరారు. కాగా, బుధవారం కృష్ణ విచారణకు హాజరుకాగా,. చట్టవిరుద్ధంగా నగదు బదిలీ సహా పలు విషయాలపై ఈడీ అధికారులు కృష్ణను విచారించారు.

అడవిలో ఏకమైన ఏనుగుల మంద

● దేవళంపేటలో పంటలపై విచ్చలవిడిగా దాడులు

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కళ్యాణి డ్యాంలో సంచరిస్తున్న తొమ్మిది ఏనుగుల గుంపు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోకి మళ్లీ ప్రవేశించాయి. అంతకు ముందే అక్కడ తిరుగాడుతున్న ఏడు ఏనుగుల గుంపును కలుసుకున్నాయి.పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా 17 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్న సంగతి తెలిసిందే.ఇటీవల ప్రమాదవశాత్తు కట్టమీద నుంచి జారిపడి ఓ ఏనుగు మృతిచెందాక తొమ్మిది ఏనుగులు కళ్యాణి డ్యాం వైపు వెళ్లిపోయాయి. అయితే ఆ ఏనుగులు సోమవారం రాత్రి పులిచెర్ల మండలంలోకి చేరుకున్నాయి. అడవిలో సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపులో మంగళవారం రాత్రి కలిసిపోయాయి. దేవళంపేట పంచాయతీలో పంటలపై 16 ఏనుగులు కలిసి విచ్చలవిడిగా దాడులు చేయడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. వ్యవసాయ బోరు మోటర్‌ను ఏనుగుల గుంపు బోరులోకి తోసేయడంతో ఓ రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లె వద్దకు చేరుకున్నాయి. వెంకటమ్మ చెరువు మార్గంలో పొలాల్లోకి చేరుకున్న ఏనుగుల గుంపు పంటలపై దాడులు ప్రారంభించాయి. మిట్టమీదరాచపల్లిలోని బసవయ్య, రమణమ్మలకు చెందిన వరి, టమోటా పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు బసవయ్యకు చెందిన వ్యవసాయ బోరు మోటారును సైతం బోరులోకి తోసేశాయి. ఇదే గ్రామంలోని సుధాకర్, రెడ్డెప్పరెడ్డి, గిరిప్రకాష్‌రెడ్డి, భాస్కర్, బాలరాజుకు చెందిన మామిడి, కొబ్బరి, వేరుశనగ, వరి, అలసంద పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తిరిగి గెండేవారిపల్లె వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు అమరనాధరెడ్డి, రామచంద్రనాయుడుకు చెందిన వరి, కొబ్బరిచెట్లను ధ్వంసం చేసి రాతికూసాలను విరిచేశాయి. అనంతరం హంద్రీ-నీవా కాలువ మీదుగా అడవిలోకి చేరుకున్నాయి. బుధవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద 16 ఏనుగుల గుంపు తిష్ఠ వేశాయని ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు తెలిపారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్ద బసచేయరాదని హెచ్చరించారు.

తెన్‌కాశిలో స్టాలిన్ కర్రసాము



తెన్‌కాశి రహదారిలో బడిపిల్లలతో కర్రసాముకు సిద్ధమవుతున్న సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలో ముఖ్యమంత్రి స్టాలిన్ తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన బడిపిల్లలతో కర్రసాము చేసి అందరినీ ఆకట్టుకున్నారు. బుధవారం ఉదయం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తెన్‌కాశి నగరానికి వెళ్ళిన స్టాలిన్‌కు దారి పొడవునా పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, స్థానికులు, విద్యార్థులు నుంచి ఘనస్వాగతం లభించింది. మార్గమధ్యంలో ఓ చోట రోడ్డు పక్కగా నిలిచి కొంతమంది బడిపిల్లలు కర్రసాము నిర్వహిస్తూ ఆయనకు స్వాగతం పలికారు. వెంటనే ఆయన కారు దిగి వారి దగ్గరకు వెళ్లి, ఆ బడిపిల్లలు ఏ బడిలో ఏంచదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కర్రసాము బాగా నేర్చుకున్నారంటూ స్టాలిన్ వారిని అభినందించారు. ఆ తర్వాత బడిపిల్లలతో కలసి స్టాలిన్ కర్రసాము చేశారు.

ఆదాయంలో కొంత పొదుపు చేయండి

● సీఎం స్టాలిన్ పిలుపు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ ఆదాయంలో కొంత పొదుపుచేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. 'ప్రపంచ పొదుపు దినోత్సవం' సందర్భంగా సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ఓ పోస్టు చేశారు. పొదుపు ఆచరిద్దాం! పొదుపు చేద్దాం! మెరుగ్గా జీవిద్దాం! అనే నినాదంతో ప్రతి ఏడాది అక్టోబరు 30వ తేది పొదుపు ఆవశ్యకత గురించి అవగాహన కల్పించేలా 'ప్రపంచ పొదుపు దినోత్సవం' జరుపుకుంటున్నాము. ఆదాయం పెంచుకోవాలని, ఖర్చులు తగ్గించడం ద్వారా సమర్థవంతంగా జీవించాలని రెండు వేల సంవత్సరాల క్రితమే తిరువళ్లువర్ ప్రపంచానికి బోధించారు. ఆదాయ మార్గాలు విస్తరించుకుని, వనరులను పెంచి అడ్డంకులు తొలగించగల వ్యక్తి కార్యాచారణ సామర్థ్యం కలిగి ఉంటాడని తిరువళ్లువర్ తెలియజేశారు. ప్రతి ఒక్కరు తమ ఆదాయంలో కొంత భాగం పొదుపు చేయాలి. అది సురక్షితమైన జీవనానికి సోపానంగా ఉంటుంది. జీవితాలు మెరుగుపడేలా ప్రతి ఒక్కరు పొదుపు చేయడం, మితిమీరిన ఖర్చులు తగ్గించడం అలవర్చుకోవాలి. మీ సమీపంలోని పోస్టాఫీసుల్లో పొదుపు ఖాతాలు ప్రారంభించాలంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ ట్వీట్ చేశారు.

కావేరి హాస్పిటల్‌లో పక్షవాత రోగులకు మెరుగైన చికిత్స



సక్సెస్ మీట్‌లో పాల్గొన్న డాక్టర్ పెరియకరుప్పన్, డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తదితరులు

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కావేరి హాస్పిటల్‌లో పక్షవాత రోగులకు సకాలంలో చికిత్స అందించి 120మందిని ప్రాణపాయం నుండి కాపాడినట్లు ఆ ఆస్పత్రి ఇంట్రావెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ పెరియకరుప్పన్ తెలిపారు. గిండీలోని స్టార్‌హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ నగరమంతటా ఆస్పత్రి వైద్య బృందాలు పర్యటించి 956 పక్షపాతం కేసులను పరిశీలించాయని, వారిలో పక్షవాతం తీవ్రరూపం దాల్చేందుకు అవకాశమున్న వారికి నాలుగున్నర గంటల్లోగా సరైన చికిత్స అందించి కాపాడినట్లు తెలిపారు. స్ట్రోక్ రివర్సల్ పద్ధతి అనుసరించి మెదడుకు రక్త ప్రసరణ ఆగకుండా సరఫరా అయ్యేలా చేసి వీరిని కాపాడినట్లు తెలిపారు. 'వరల్డ్ స్ట్రోక్ డే' సందర్భంగా తమ ఆస్పత్రి వైద్య సిబ్బందితో ఈ సక్సెస్ మీట్ ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. పక్షవాతానికి సంబంధించి చికిత్స కోసం 044-4000 6000 అనే హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, ఐఏఎస్ అధికారి డాక్టర్ విజయ కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

బోస్ వెంకట్ దర్శకత్వంలో క్రీడా చిత్రం

సీనియర్ దర్శక నటుడు బోస్ వెంకట్ మరో చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. క్రీడా నేపథ్యంలో తెరకెక్కే ఈ సినిమాను కేజీఆర్ మూవీస్ పతాకంపై నిర్మాత కన్నన్ రవి భారీ బడ్జెట్, హంగులతో తెరకెక్కించనున్నారు. ఎక్స్‌ట్రా ఎంటర్‌టైన్మెంట్ అధినేత వి.మదియళగన్ సహ నిర్మాత. క్రీడా, ప్రేమ, కుటుంబం సెంటిమెంట్స్‌తో మంచి సమాజ సందేశాత్మక చిత్రంగా తెరకెక్కించనున్నారు. దుబాయ్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన కన్నన్ రవి... తమ సొంత నిర్మాణ సంస్థ కేజీఆర్ ప్రొడక్షన్ బ్యానరుపై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. గతంలో బోస్ వెంకట్ దర్శకత్వం వహించిన 'కన్నిమడం', 'సార్' మూవీలు ప్రేక్షకుల ఆదరణ పొందడంతో పాటు సినీ విమర్శకులు సైతం చిత్రాన్ని మెచ్చుకున్నారు. ఇపుడు ఆయన మూడో చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. తన కొత్త ప్రాజెక్టు గురించి బోస్ వెంకట్ మాట్లాడుతూ, 'క్రీడల చుట్టూ కేంద్రీకృతమైన ఈ చిత్రం ప్రేమ, కుటుంబంతో పాటు వివిధ సామాజిక ఇతివృత్తాలను ప్రస్తావిస్తూ సాగుతుంది. భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ చిత్రం ఒక మైలురాయిగా నిలుస్తుందని భావిస్తున్నాను. వీలైనంత త్వరగా చిత్రీకరణ పూర్తి చేసి విడుదల చేస్తాం. ఇందులో నటీనటులు, పనిచేసే సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.



బోస్ వెంకట్, కన్నన్ రవి, యువన్ శంకర్ రాజా, మదియళగన్

ఆర్.మాధవన్ - నిమిషా జంటగా

'లెగసీ' వెబ్ సిరీస్



'లెగసీ' వెబ్ సిరీస్ బృందం

చిత్రజ్యోతి

విలక్షణ నటుడు ఆర్.మాధవన్, హీరోయిన్ నిమిషా సజయన్ జంటగా నెట్‌ఫ్లిక్స్ కోసం 'లెగసీ' పేరుతో ఓ తమిళ వెబ్‌సిరీస్ రూపుదిద్దుకుంది. చారుకేష్ శేఖర్ దర్శకుడు. క్రిమినల్ నేపథ్యం కలిగిన ఒక వృద్ధుడు.. తన శక్తిమంతమైన సామ్రాజ్యం నుంచి తప్పించుకోలేని ఒక సమస్యలో చిక్కుకుంటారు. దీంతో తనను, తన కుటుంబం, సామ్రాజ్యాన్ని రక్షించడం కోసం ఒక యువకుడిని దత్తత తీసుకుంటారు. ఆయన వృద్ధుడుతో పాటు అతని కుటుంబాన్ని, నేర సామ్రాజ్యాన్ని రక్షించారా? లేదా? అన్నదే ఈ వెబ్ సిరీస్ స్టోరీ. ఈ వెబ్ సిరీస్‌లో తన పాత్ర గురించి ఆర్.మాధవన్ మాట్లాడుతూ, ' కథ ఆలకించే సమయంలోనే మనలో ఉన్న నటుడిని తట్టిలేపుతుంది. అలాంటి కథా చిత్రాల్లో నటించేందుకు ఉత్సాహం కలుగుతుంది. ఆ కారణంగానే 'లెగసీ' సిరీస్‌లో నటించేందుకు సమ్మతించాను. ఓటీటీ వేదికల్లో ఇప్పటివరకు వచ్చిన వెబ్ సిరీస్‌లకు పూర్తి భిన్నంగా ఉంటుంది. దర్శకుడు చారుకేష్ శేఖర్, స్టోన్ బెంచ్ సంస్థతో కలిసి పని చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సిరీస్ ప్రతి ఒక్కరినీ ఆలరిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. కాగా, ఈ వెబ్ సిరీస్‌లో నిమిషా సజయన్‌తో పాటు సీనియర్ దర్శకుడు గౌతం వాసుదేవ్ మేనన్, గుల్షన్ దేవయ్య, అభిషేక్ బెనర్జీ తదితరులు నటించారు.

గ్రామీణ నేపథ్యంలో కామెడీ ఫాంటసీ మూవీ



పూజా కార్యక్రమంలో చిత్ర బృందం

మలయాళంలో సోషల్ మీడియా, టెలివిజన్ షోల ద్వారా గుర్తింపుపొందిన షాలిన జోయా కోలీవుడ్‌కు దర్శకురాలిగా తొలిసారి పరిచయమవుతున్నారు. ఆమె తన తొలి చిత్రాన్ని 1990 కాలంలో గ్రామీణ నేపథ్యంలో సాగే కామెడీ ఫాంటసీ మూవీగా రూపొందించనున్నారు. ఇందులో 'నక్సలైట్' ఫేం అరుణ్ సరసన బ్రిగిడా హీరోయిన్‌గా నటించనున్నారు. ఆర్‌కే ఇంటర్నేషనల్ పతాకంపై రూపొందే ఈ సినిమా షూటింగ్ పూజా కార్యక్రమంతో తాజాగా ప్రారంభమైంది. ఇతర పాత్రల్లో ఎం.ఎస్.భాస్కర్, అరుల్‌దాస్, ఇళవరసు, జావా సుందరేశన్, జెన్సన్ దివాకర్ తదితరులు నటిస్తున్నారు. ఓ ముఖ్య పాత్రలో దేవదర్శిని, గౌరవ అతిథి పాత్రలో అశ్విన్ నటించనున్నారు. ఈ సినిమా గురించి షాలిన జోయా మాట్లాడుతూ, '1990 ఆఖరులో జరిగే స్టోరీ. గ్రామంలో ఒక సంఘటన జరుగుతుంది. దీనికి కామెడీ ఫాంటసీ కలిపి అక్కడ ప్రజల జీవితాలను మార్చే కథను చెప్పబోతున్నాం. ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చిన నిర్మాత రామకృష్ణకు కృతజ్ఞతలు. ఉత్తమ కథా చిత్రాలను అభిమానించే తమిళ ప్రేక్షకులు మా చిత్రాన్ని కూడా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు.

'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడికి కారు బహుమతి



అభిషన్ జీవింత్, మహేష్ రాజ్

తొలి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న యువ దర్శకుడు అభిషన్ జీవింత్‌కు నిర్మాత మహేష్ రాజ్ ఒక లగ్జరీ కారును బహూకరించారు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' నిర్మాతల్లో ఒకరైన మహేష్ రాజ్... ఈ కారును అభిషన్‌కు పెళ్లి బహుమతిగా అందజేశారు. అభిషన్ జీవింత్ వివాహం ఈ నెల 31వ తేదీన ప్రియురాలితో జరుగనుంది. ఈ మ్యారేజ్ గిఫ్టుగా నిర్మాత మహేష్ రాజ్ బీఎండబ్ల్యూ కారు అందజేశారు. కాగా, 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో దర్శకుడిగా పరిచయమైన అభిషన్.. ఇపుడు హీరోగా ఓ చిత్రంలో నటించారు. ఈ చిత్రం అతి తక్కువ కాలంలో షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది.

నాన్ ముదల్వన్ పథకంలో లబ్ధిదారు ఇంటి నిర్మాణం పరిశీలన



ఇంటి నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ప్రేమా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాన్ ముదల్వన్ పథకం ద్వారా లబ్ధిపొంది ప్రైవేటు సంస్థలో ఉద్యోగం సంపాదించుకున్న తెన్‌కాశి బాలిక ప్రేమా ఇంటి నిర్మాణ పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఇటీవల చెన్నై నెహ్రూ ఇండోర్‌స్టేడియంలో 'విద్యలో అగ్రస్థానంలో తమిళనాడు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రేమా తాను వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నానని, అయితే తన తల్లిదండ్రులు పైకప్పు సక్రమంగా లేని ఇంటిలో ఉంటున్నారని పేర్కొంది. దీనికి స్పందించిన సీఎం ఆ బాలిక తల్లిదండ్రులకు 'కలైంజర్ గృహనిర్మాణ పథకం' కింద ఓ ఇంటిని నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు తెన్‌కాశి కళసీర్‌కుళంలో ప్రేమా తల్లిదండ్రుల కోసం జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను స్టాలిన్ పరిశీలించారు. వీలైనంత త్వరగా ఆ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయమని అధికారులను ఆదేశించారు.



ఫ్లైఓవర్ నిర్మించాక ఇలా మారనున్న ఎల్డామ్స్ రోడ్డు ప్రాంతం



ఎస్ఐటీ కాలేజీ కూడలిలో పైన వంతెన, దిగువన ఇరువైపులా మెట్రోరైళ్లు (ఊహా చిత్రం)

అన్నాసాలైలో ట్రాఫిక్ రద్దీకి ఫుల్‌స్టాప్

● రూ.621 కోట్లతో భారీ ఫ్లైవోవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి వరకూ అమలు చేసిన ఎంఆర్‌టీఎస్, మెట్రోరైలు ప్రాజెక్టులు, ఇవి కాకుండా డీఎంకే ప్రభుత్వ హాయంలో నిర్మించిన పదికిపైగా రహదారి వంతెనలు నగరం రూపురేఖలను మార్చాయి. ఇవన్నీ నగరవాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించినట్లే అనిపించినా, ప్రధానమైన రహదారి మౌంట్‌రోడ్డులో ట్రాఫిక్ కూడా పరిష్కరిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ దిశగానే ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం రూ. 621 కోట్లతో ఫ్లైలెవర్ ఫ్లై ఓవర్ నిర్మాణ పథకాన్ని అమలు చేయనుంది. ఇప్పటికే ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. ఈ ఫ్లైవోర్ తేనాంపేట నుంచి సైదాపేట వరకు నిర్మించనున్నారు. దీంతో అన్నాసాలైలో వాహనచోదకులు ట్రాఫిక్ కష్టాల నుండి బయటపడనున్నారు. ఈ భారీ రహదారి వంతెన ఎల్డామ్స్ రోడ్ జంక్షన్, ఎస్ఐటీ కాలేజీ రోడ్ జంక్షన్, సెంటాప్ జంక్షన్, నందనం జంక్షన్, సీఐటీ జంక్షన్లను కలిపేలా నగరం మధ్యలో కొత్త అందాలు సంతరించుకోనుంది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తయితే అన్నాసాలై ఎలా వుంటుందో ప్రభుత్వం ఊహా చిత్రాలను కూడా విడుదల చేసింది.









సైదాపేట మెట్రోరైల్వేస్టేషన్ ప్రాంతం - నందనం జంక్షన్ (ఊహా చిత్రాలు)



రెటినోపతి స్క్రీనింగ్ పరికరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

నేత్ర సమస్యలపై అశ్రద్ధ వద్దు

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలపై అశ్రద్ధ చూపరాదని కంటి వైద్యనిపుణులు ప్రజలకు సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా రాధాత్రి నేత్రాలయం, రోటరీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ది రోటరీ 3233 డిస్ట్రిక్ట్ గవర్నర్ దేవేంద్రన్, గౌరవ అతిథిగా నటి సంచిత శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.వాసుమతి దేవేంద్రన్ మాట్లాడుతూ.. కంటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు టి.నగర్ హింది ప్రచార సభ వీధిలోని రాధాత్రి నేత్రాలయంలో ఉచిత పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. నవంబరులో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నామని, పరీక్షలకు హాజరయ్యేవారు 9445438681 అనే నెంబరుకు ఫోన్ చేసి ముందుగా పేరు నమోదుచేసుకోవాలని డా.వాసుమతి దేవేంద్రన్ తెలియజేశారు.

అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో

పక్షవాత చికిత్స కోసం 9 ల్యాబ్‌లు



మీడియా సమావేశంలో పక్షవాతబాధితుల వైద్యసేవల విస్తరణ లోగోను ప్రదర్శిస్తున్న వైద్యనిపుణులు

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని అపోలో హాస్పిటల్స్ పక్షవాత రోగులకు మరింత నాణ్యమైన చికిత్స అందించేందుకు 9 ల్యాబ్‌లను ఏర్పాటు చేసి తన సేవలను విస్తరింపజేస్తోందని ఆ ఆసుపత్రి న్యూరో ఎండోవాస్కులర్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం తెలిపారు. బుధవారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పక్షవాతం రోగులకు మెకానికల్ థ్రోంబెక్టమీ, ఎండోవాస్కులర్ మైక్రో సర్జికల్ చికిత్స, న్యూరో ఎండోవాస్కులర్ చికిత్స అందించటంలో అపోలో ఆస్పత్రులకు పేరుందని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ విజయశంకర్, డాక్టర్ శ్రీనివాస్ యూఎం, డాక్టర్ సతీష్‌కుమార్, అపోలో హాస్పిటల్స్ చెన్నై రీజిన్ సీఈఓ డాక్టర్ ఇలంకుమరన్ కలియమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాందాస్‌తో డీఎంకే మిత్రక్షాల భేటీ

● పొత్తు కోసం ప్రయత్నాలా?



రాందాస్‌తో సమావేశమైన కొంగునాడు మక్కల్ దేశియకట్చి నేత ఈశ్వరన్ తదితరులు

చెన్నై, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను డీఎంకే మిత్రపక్షం కొంగునాడు మక్కల్ దేశియ కట్చి నాయకుడు ఈశ్వరన్ తదితరులు ఆకస్మికంగా కలుసుకున్నారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో ఉన్న తైలాపురం గార్డెన్‌కు ఈశ్వరన్ తదితర నాయకులు వెళ్ళి రాందాస్‌తో భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వారు అరగంటకు పైగా చర్చ జరిపారు. ఈ చర్చల్లో పీఎంకే కార్యాచరణ అధ్యక్షురాలు శ్రీకాంతి, నామక్కల్ ఎంపీ మాతేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ఈశ్వరన్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రాందాస్ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందారని, ఆ సమయంలో తాను నగరంలో లేకపోవడంతో పరామర్శించలేకపోయానని చెప్పారు. రాందాస్‌ను పరామర్శించేందుకే వచ్చానని తెలిపారు. పీఎంకేలో అన్ని వర్గాలు ఒక్కటై సమష్టిగా ఎన్నికల బరిలోకి దిగాలని తాను ఆకాంక్షిస్తున్నానని, ఈ విషయాన్ని రాందాస్‌కు తెలిపానన్నారు. డీఎంకే కూటమిలో పీఎంకే చేరుతుందా లేదా అనే విషయమై తాను ఎలాంటి ప్రకటన చేయలేనని, ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకే మాత్రమేనని ఈశ్వరన్ స్పష్టం చేశారు. పొత్తుకు సంబంధించిన చర్చలు వచ్చే యేడాది జనవరిలోనే జరుగుతాయని ఆయన తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు సీఆర్ నాయుడు కన్నుమూత



సీఆర్ నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):సీనియర్ జర్నలిస్టు చెరుకూరి రంగయ్య నాయుడు అలియాస్ సీఆర్ నాయుడు (82) బుధవారం కన్నుమూశారు.వయోభారంతో,అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా హైదరాబాదులో చికిత్స పొందుతున్న ఆయన బీరంగూడలోని కుమార్తె హిమబిందు నివాసంలో తుదిశ్వాస విడిచారు. పాకాల పట్టణం కమతంపల్లెకు చెందిన సీఆర్ నాయుడు ఆంధ్రప్రభ, ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఉదయం, వార్త దినపత్రికల్లో తిరుపతి, బెంగళూరు, చెన్నై కేంద్రాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.గురువారం ఉదయం 10గంటలకు బీరంగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘాట్‌రోడ్డులో బైకుల ఢీ

ఇద్దరికి గాయాలు



తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో బుధవారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. తిరుపతికి చెందిన చంద్రమౌళి బైక్‌లో తిరుమలకు వెళ్తుండగా ఆ ప్రాంతంలో పనులు చేసే కార్మికుడు జితేంద్ర బైక్‌పై ఎదురొచ్చాడు. రెండు బైక్‌లూ ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. భద్రతాసిబ్బంది వారిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అలిపిరి నుంచి వినాయకుడి గుడిదాకా డబుల్ రోడ్డు ఉంటుంది. తిరుమలకు వెళ్లే వైపున కాకుండా మరోవైపున చంద్రమౌళి ప్రయాణిస్తుండగా అదే మార్గంలో ఎదురొచ్చిన బైక్‌ను ఢీకొన్నాడు.

→ ఘటనా ప్రాంతంలో గాయాలతో జితేంద్ర, చంద్రమౌళి

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.57 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 64,250

తలనీలాలు సమర్పించినవారు: 25,250

తుఫానే తలవంచింది!



చినుకుల్లో రోడ్డు ఊడుస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎడతెరిపి లేని వాన.. ఈడ్చికొడుతున్న ఈదురుగాలులు, వణికిస్తున్న చలి.. ఇటువంటి వాతావరణంలోనూ తిరుమలలో పారిశుధ్య కార్మికులు తమ విధులు యథాతథంగా నిర్వహిస్తున్నారు. పలుచని పాలిథిన్ రెయిన్‌కోట్‌లు ధరించి పనులు చేస్తూ కనిపిస్తున్నారు. ఆలయపరిసరాలు, కాటేజీలున్న ప్రాంతాల్లోనే కాకుండా, నడక దారులు, వేదపాఠశాల, శ్రీవారి పాదాలు మార్గం, పాపవినాశనం మార్గంలోనూ బుధవారం కార్మికులు పనులు చేస్తూ కనిపించారు. టీటీడీ హెల్త్ విభాగంలో 2,152 మంది పారిశుధ్య కార్మికులున్నారు. మూడు షిఫ్టుల్లో వీరు విధులు నిర్వహిస్తుంటారు. తిరుమల పరిశుభ్రత, అందం వీరి శ్రమ సౌందర్య ఫలితమే! మొంథా తుపాను వానలు వీరి విధినిర్వహణ ముందు తలవంచక తప్పలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కాలిబాట మార్గాలను శుభ్రపరుస్తున్న కార్మికులు

917 హెక్టార్లలో పంట నష్టం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో 917 హెక్టార్లలో పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభ దశలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపించాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు వరి నాట్లు వేశారన్నారు. విస్తారంగా కురిసిన వర్షాలకు 917 హెక్టార్ల మేర పైరు నీటి మునిగిందన్నారు. పొలాల్లో నీరు బయటకుపోయిన తర్వాత పూర్తి నష్టాన్ని అంచనా వేయగలమన్నారు.

రక్తమోడుతున్న రైలు పట్టాలు

● ఐదేళ్లలో 436 మంది మృత్యువాత ● ప్రమాదాలు కొన్ని.. బలవన్మరణాలు మరికొన్ని



రైలు పట్టాలపై పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్ ఫొటో)

తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి.. తిరుపతి వెస్ట్ స్టేషన్ వరకు 12 కిలోమీటర్లు. ఈ మధ్యలో.. ఐదేళ్లలో దాదాపు 436 మంది రైలు పట్టాలపై ప్రాణాలు కోల్పోయారు. ఆందోళన కలిగించే గణాంకాలివీ. ఈ మృతుల్లో.. రైళ్ల నుంచి జారిపడిన వారు, పట్టాలు దాటే సమయంలో రైళ్లు ఢీకొనడం, ఆత్మహత్యలు చేసుకున్న వారున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఐదేళ్లలో మృతిచెందింది: 436 మంది

రైలు నుంచి జారిపడిన ఘటనల్లో: 130 మంది

పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొనడంతో చనిపోయింది: 65 మంది

పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకుంది: 210 మంది

గుర్తు తెలియని వారు: మరో 31 మంది

● రెండు రోజుల క్రితం తిరుపతి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నెంబరు 5లో తిరుపతి-కొల్హాపూర్ వెళ్లే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ కదులుతుండగా 45 ఏళ్ల వ్యక్తి రైలు ఎక్కుతున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి రైలుకు, ప్లాట్‌ఫారానికి మధ్యలో పడి శరీరం రెండు ముక్కలై మృతి చెందాడు.

● తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్ మధ్య రిలయన్స్ అండర్ బ్రిడ్జి సమీపంలో 50 సంవత్సరాల వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

ఈ రెండూ మచ్చుకు ఉదాహరణలే. తిరుచానూరు.. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ మధ్య తరచూ ఎక్కడో ఒక చోట రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఉంటున్న జనరల్ బోగీల్లో ఫుట్‌పాత్‌పై ప్రమాదకర పరిస్థితుల్లో కూర్చున్న వారిలో పలువురు ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందుతున్నారు. ఇంకొందరు ప్రయాణికులు పట్టాలు దాటే సమయంలో.. రైలు దగ్గరకు వచ్చే సరికి వెళ్లిపోవచ్చని అనుకుంటారు. ఇలా పలువురు ప్రమాదకర పరిస్థితుల్లో పట్టాలు దాటుతూ మృతి చెందుతున్నారు. పూర్ణకుంభం సమీపంలోని రైల్ ఓవర్ బ్రిడ్జి వద్ద.. అటు పద్మావతి మహిళా వర్సిటీ సమీపంలో.. మరోవైపు స్టేషన్‌లో రైలు షంటింగ్ చేసే సమయంలో ఎక్కువగా చనిపోతున్నారు. ప్రతి నెలా సగటున 5 నుంచి 8 మంది వివిధ కారణాలతో మృత్యువాతపడుతున్నారు. ఇలా ఐదేళ్లలో 436 మంది చనిపోగా.. వీరిలో 31 మంది గుర్తు తెలియని వ్యక్తులే. వీరి వివరాలు తెలియక అనాధ శవాలుగా ఖననం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

రైలు ప్రమాదాల నివారణలో భాగంగా రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు, సంయుక్తంగా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. రైలు వచ్చే సమయంలో మైకు ద్వారా అప్రమత్తం చేస్తున్నాం.

- ఆశీర్వాదం, రైల్వే సీఐ

ప్రత్యేక ఫీజు సీట్లకు అడ్మిషన్లు

◆ ఎస్వీయూలో ఇంజనీరింగ్, ఫార్మసీలో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రత్యేక ఫీజుతో అడ్మిషన్లకు అనుమతించారు. ఈమేరకు ఎంటెక్, ఎంఫార్మసీ, బీఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు అవకాశమేర్పడింది. అర్హత,ఆసక్తి ఉన్న విద్యార్థులు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ప్రకటనలో తెలిపారు. ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్-2025 మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ -2025 రెండవ ప్రాధాన్యత, బీటెక్ వారికి చివరి ప్రాధాన్యతలో అడ్మిషన్లు ఇస్తారు. ఎంఫార్మసీలో చేరడానికి జీ ప్యాట్-2025 వారికి మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్-2025 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, బీఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇస్తారన్నారు. బీఫార్మసీలో చేరడానికి ఏ.పి.సెట్-2025 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులకు చివరి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంటెక్ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1,45,170, ఎంఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1, 53,940, బీ ఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ.81 వేలుగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. 'ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.ఇన్.డీవోఏ' వెబ్‌సైట్‌లో చూడాలని ఆ ప్రకటనలో సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సందర్భంగా బుధవారం రిజర్వుడ్ గ్రౌండులో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం పోలీసు శాఖ ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరమైన సాంకేతిక వ్యవస్థలను వారు ఆసక్తిగా తిలకించారురు. అమరవీరుల త్యాగాలకు వారు నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశ భక్తి, సేవాస్ఫూర్తిలను పెంపొందించడం పోటీల ఉద్దేశమని చెప్పారు. అమర వీరుల త్యాగాలను భావి తరాలకు తెలియచేయడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత, సీఐ తమీమ్ అహ్మద్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి చేల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు బుచ్చినాయుడు కండ్రిగ మండలం కారణిమిట్టలో నీట మునిగిన వరిచేలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. పంటలతో పాటుగా ఎంత మేర నష్టం వాటిల్లిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా పంపిణీ సజావుగా సాగుతోందా అన్ని రైతులను అడిగారు. తమకు ఇస్తున్న యూరియా చాలడం లేదని రైతులు చెప్పారు. తెగిన చెరువులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. నారాయణవనం మండలం తుంబూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాధితులకు నగదు, సరుకులు అందజేశారు. వెదర్లకండ్రిగలోని పునరావాస కేంద్రాన్నీ పరిశీలించారు.



కారణిమిట్టలో వరిపంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పూడి రైల్వేలైన్‌కు 6.5 ఎకరాలు గుర్తించాం

● అమ్మవారిపట్టెడలో రైతులతో ఆర్డీవో సమావేశం



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

రేణిగుంట అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి):పూడి రైల్వే లైన్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి సమావేశమయ్యారు. బుధవారం మండల పరిధిలోని అమ్మవారి పట్టెడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పూడి రైల్వే లైన్ నిర్మాణానికి గ్రామంలోని రైతులకు చెందిన 6.5 ఎకరాలను గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన 29 రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీటీ శ్యాం ప్రసాద్, ఆర్ఐ జైకృష్ణ, సర్వేయర్ సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.





వసంత మండపంలో మన్ను సేకరిస్తూ.. - విష్వక్సేనుడికి హారతులిస్తున్న అర్చకులు

పుష్పయాగానికి అంకురార్పణ

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం జరగనున్న పుష్పయాగానికి బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు ముందు ఆచార్య ఋత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే ఋత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణకోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు. ఇక, రాత్రి 7 గంటలకు శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడిని ఆలయం నుంచి వసంతమండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. 8 నుంచి 9 గంటల నడుమ ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ జరిగింది.

నేడు పుష్పయాగం: శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు కల్యాణమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు రకాల పత్రాలు, 12 రకాల పుష్పాలతో (సుమారు 9 టన్నులు) ఉత్సవర్లకు పుష్పయాగం నిర్వహిస్తారు.

రైతుల పరిస్థితి దయనీయం

● ముక్కంటి ఆలయంలో అవినీతి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో పరిశ్రమలకు కల్పిస్తున్న సదుపాయాలను రైతులకు ఇవ్వడం లేదని దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 11 ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం రైతులకు చేసింది శూన్యమన్నారు. యూపీయే హయాంలో రూ.70వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అదానీకి భూములు, విమానాశ్రయాలు ఇస్తారు కానీ రైతులకు ఏం ఇచ్చారని ప్రశ్నించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.22వేల కోట్లు రాయితీ ఇచ్చారని, రైతు బిడ్డ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు ఏం చేశారన్నారు. యూపీఏ హయాంలో శ్రీసిటీ, మేనకూరు సెజ్, కృష్ణపట్నం పోర్టు తెచ్చామన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు రూ.14.50 లక్షల కోట్ల రుణమాఫీ చేశాయని, ఎవరికి ఎంత మాఫీ చేశారో ప్రధాని మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్, సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. తమ హయాంలో మన్నవరంలో భెల్ పరిశ్రమకు పునాదిరాయి వేయగా నేడు అనాది రాయిగా మిగిలిందన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెప్పులు, సెల్‌ఫోన్ స్టాండ్, కారు పార్కింగ్‌లో అవినీతి చోటు చేసుకుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 20 వేల ఎకరాల భూములను స్వాహా చేశారని సీఎం, కలెక్టర్ జోక్యం చేసుకుని ఆక్రమణలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, సమీవుల్లా, రవి, జనార్దన రెడ్డి, శివయ్య, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ విధుల్లో అలసత్వం..

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

తడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ విధుల్లో అలసత్వం వహించిన మరో పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ అయ్యింది. సోమవారం రాత్రి కారూరు సచివాలయ పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు తుఫాన్ విధులు నిర్వహించడంలో అలసత్వం వహించారని అధికారుల పరిశీలనలో తేలింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ తహసీల్దారు శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కాగా, ఇప్పటికే పెరియవట్టు, పూడి, అండగుండాల, సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

యాచవరం సొసైటీ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు

బాలాయపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు... మండలంలోని అక్కసముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 178లో 4.60 ఎకరాలను యాచవరం ఎస్సీ కాలనీకి చెందిన వరికూటి అన్నపూర్ణ ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిని ఆక్రమించుకునేందుకు వెంగమాంబపురం గ్రామానికి చెందిన యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడు ఎక్స్‌కవేటర్, డోజర్లతో చదును చేస్తుండగా అన్నపూర్ణ తన మరిది జయరామయ్యతో కలిసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో సీసీ నాయుడు దాడి చేసి కులంపేరుతో దూషించాడని అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డీ-ఎడిక్షన్ కేంద్ర విస్తరణ యోచన

● పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవికృష్ణ

తిరుపతి(వైద్యం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని మత్తు వ్యసన నిర్మూలన కేంద్రాన్ని(డీ-ఎడిక్షన్ కేంద్రం) 60 పడకలతో విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఏరవికృష్ణ చెప్పారు. ఈ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ తిరుపతితోపాటు విశాఖపట్నం, కర్నూలు జిల్లాల్లోని కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తున్నామన్నారు. మత్తు వ్యసనాల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రలను బాధితులు వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురితో ఆయన మాట్లాడారు. సదుపాయాల గురించి ఆరా తీశారు. చికిత్సా విధానాలను పరిశీలించారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలను చాలా వరకు అరికట్టామని ఐజీ చెప్పారు. విద్యార్థులకు,యువతకు అవగాహన కల్పించి గంజాయి జోలికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇక్కడి కేంద్రంలో అందిస్తున్న చికిత్సలు, కౌన్సెలింగ్ పద్ధతుల గురించి ఎస్పీ సుబ్బరాయుడు ఆయనకు వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధ, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఏఆర్ఎంవో హరికృష్ణ, డిఐవో హరిప్రసాద్, మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం విభాగాధిపతి డాక్టర్ పద్మావతి, మెడికల్ ఆఫీసర్ మానస, కౌన్సలర్లు మురళీ, ఈగల్ టీం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగుల వివరాలు పరిశీలిస్తున్న ఐజీ రవికృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు మంగళం డిపో మేనేజర్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, పంచరామారాలు, మొగిలి, శ్రీకాళహస్తి, తిరువణ్ణామలై, కోటిలింగాలు, గుడిమల్లం, ముక్కోటి ఆలయాల సందర్శనకు బస్సులు కేటాయించామని పేర్కొన్నారు. వివరాలను గురువారం ఆన్‌లైన్‌లో ఉంచుతామని, భక్తులు ముందస్తుగానే టిక్కెట్ పొందవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7893723453, 8247687578లను సంప్రదించాలని కోరారు.

పద్మావతి వర్సిటీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో నాలుగు రోజుల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ చేపట్టింది. విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడం, ప్లేస్‌మెంట్ అవకాశాలకు సిద్ధం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇన్ఫోసిస్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ పూర్తి అయిన తర్వాత క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కూడా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని ప్రారంభించగా, సైన్స్ డీన్ సుధా నిర్వహించారు.